సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం ‌। 4 ‌। మార్చి ‌। 2024



‘గృహజ్యోతి’తో వెలుగులు

గృహజ్యోతి పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



ముగిసిన ఆర్యసమాజ్ ఉత్సవాలు

నల్లగొండలో 1వ తేదీ నుంచి జరుగుతున్న ఆర్యసమాజ్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. - 8లో



అగ్నిప్రమాదం

నాగార్జునసాగర్ ఫారెస్ట్ డివిజన్‌లోని నాగార్జునపేట తండా ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

భువనగిరి : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల్లో 6,7,8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకోసం ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు భువనగిరి పట్టణంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగింది. 1,429 మంది విద్యార్థులకు 1,296 మంది హాజరయ్యారు. 153 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని గుత్తాకు ఆహ్వానం



గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోట మల్లారెడ్డి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 21వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న స్వామివారి తిరుకల్యాణం నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవానికి రావల్సిందిగా ఆదివారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆలయ నిర్మాణ ధర్మకర్తలు కోట మల్లారెడ్డి పుష్పలత దంపతులు ఆహ్వాన పత్రిక అందజేశారు.


గ్రూప్‌-1 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

చౌటుప్పల్ : టీఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్షకు ప్రిపరేషన్ అయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్య శిక్షణ కేంద్రం ఉమ్మడి నల్లగొండ జిల్లా డైరెక్టర్ కొప్పు విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్, డిగ్రీ మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు.దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో నల్లగొండలోని స్టడీ సర్కిల్ కార్యాలయానికి రావాలని సూచించారు.వివరాలకు 08682-220007 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. గతంలో శిక్షణపొందిన అభ్యర్థులు అనర్హులని పేర్కొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

భూదాన్‌పోచంపల్లి : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి మాట నిలబెట్టుకుంటామని డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు స్కీంలను అమలు చేస్తుందని, త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులందరికీ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందజేస్తామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, నాయకులు కళ్లెం రాఘవరెడ్డి, బొడిగె శంకరయ్య, జింక జంగయ్య, చెక్క వెంకటేశ్, మచ్చ నర్సింహ, మచ్చ ఇస్తారి, చెక్క రాజు, చుక్క నర్సింహ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గుట్ట డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

యాదగిరిగుట్ట : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు యూనియన్‌లకు అతీతండా ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వర్తింపజేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన బంద్ కాలం నాటి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన తెలిపామని, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవ చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్మికులు మురళీ, కృష్ణయ్య, కుమార్, రమేష్ ,యాదగిరి, నగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, ఆరాధన, అభిషేకం చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. ఇక ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఊరేగించారు.





యాదాద్రి ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీస్వామి, అమ్మవారికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు, కల్యాణంలో పాల్గొన్న భక్తులు

యాదాద్రి కాదు.. యాదగిరిగుట్టనే?

- పాత పేరుతో జీఓ విడుదల చేయనున్న ప్రభుత్వం
- 2015లో యాదాద్రిగా మార్చిన చినజీయర్ స్వామి, కేసీఆర్



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం

యాదగిరిగుట్ట: భక్తులకు కొంగుబంగారంగా విలసిల్లుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలని అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ 2015లో సంకల్పించారు. ఆ ఏడాది బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాస్తు, ఆగమ, శిల్పశాస్త్ర నియమాలకు అనుగుణంగా పీఠాధిపతులు, పండితులు, నిపుణుల సూచనలు, సలహాల మేరకు యాదాద్రి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టారు. ఐదేళ్లలో ఆలయ నిర్మాణ, సుందరీకరణ పనులను పూర్తి చేశారు. కాగా.. యాదర్షి మహాముని తపో దీక్ష చేయడంతో ఏర్పడిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి.. అదే సంవత్సరంలో యాదాద్రి ఆలయంగా నామకరణం చేశారు. కానీ.. ఇప్పుడు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి యాదాద్రి ఆలయాన్ని యాదగిరిగుట్టగా మారుస్తారనే చర్చ జరుగుతోంది.

యాదాద్రిగా మార్చిన జీయర్ స్వామీజీ, కేసీఆర్

యాదగిరిగుట్ట ఆలయాన్ని పునర్నిర్మించడంలో భాగంగా ఆగమశాస్త్ర పీఠాధిపతులు త్రిదండి రామానుజ చినజీయర్ స్వామీజీని అప్పటి సీఎం కేసీఆర్ యాదాద్రి పర్యటనకు 2015 మార్చి 4న దేవస్థానానికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణాలపై చర్చించి, సమీపంలోని పెద్ద గుట్టను టెంపుల్ సిటీగా నిర్మాణం చేసేందుకు శంకుస్థాపన పూజలు చేశారు. అక్కడే ఈ పెద్దగుట్టకు టెంపుల్ సిటీగా పేరుపెట్టారు. అలాగే యాదగిరిగుట్టతో పాటు చుట్టు పక్కల ఉన్న ఎనిమిది గుట్టలను కలిపి నవగిరులుగా నామకరణం చేశారు. అంతే కాకుండా యాదగిరిగుట్ట ఆలయాన్ని ‘యాదాద్రి’ పుణ్యక్షేత్రంగా నామకరణం చేశారు.

యాదాద్రి పేరుతోనే జిల్లా..

2016 అక్టోబర్ 11న నూతన జిల్లాల పునర్విభజన జరిగింది. ఇందులో భాగంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం పేరుతో జిల్లాను ఏర్పాటు చేయాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాకు సంబంధించిన కార్యాలయాలన్నీ భువనగిరిలో ఉండటంతో పాటు త్రిభువన మల్ల విక్రమాదిత్య పేరుతో ఉన్న భువనగిరిని కలుపుతూ ‘యాదాద్రి భువనగిరి’ జిల్లాగా ఏర్పాటు చేశారు. దీంతో నాటి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాగా కొనసాగుతోంది. కాగా. ఇప్పుడు యాదాద్రి ఆలయం పేరు యాదగిరిగుట్టగా మారుస్తారని చర్చ జరుగుతుండటంతో.. జిల్లా పేరు కూడా మారుస్తారా.. అలాగే ఉంటుందా అనే సందేహాలు కలుగుతున్నాయి.

2022 నుంచే..

కేసీఆర్‌కు చినజీయర్‌స్వామీజీకి మధ్య ఏర్పడిన దూరంతో 2022 జనవరి నుంచి యాదాద్రి ఆలయానికి సంబంధించిన ఏ ప్రకటన అయినా యాదగిరిగుట్ట పేరుతోనే వెలువడుతున్నట్లు తెలుస్తోంది.

మళ్లీ పాత పేరు

యాదాద్రి పేరును తిరిగి యాదగిరిగుట్టగా మార్చే ఆలోచనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇటీవల యాదాద్రి కొండపై మొక్కు కొబ్బరి కాయలు కొట్టే స్టాండ్ ప్రారంభించినప్పుడు మీడియాతో ఈ విషయం చెప్పారు. ఈ క్షేత్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసే ఆలోచనలో సీఎం రేవంత్ ఉన్నట్లు సమాచారం. క్షేత్రానికి పూర్వ సంప్రదాయం చేకూర్చేలా ప్రయత్నాలు చేయనున్నట్లు తెలిసింది. ఆలయ అభివృద్ధిలో భాగంగా కొండపైన భక్తులు నిద్రచేసే చోటు, విష్ణు పుష్కరిణిలో స్నానాలు, కొబ్బరికాయలు కొట్టే స్థలాలను తొలగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొండపైన ఇప్పటికే భక్తులు కొబ్బరికాయలు కొట్టే స్థలాన్ని ప్రారంభించారు. ఇక భక్తులు కొండపైనే నిద్ర చేసే విధంగా క్యూ కాంప్లెక్స్ లో డార్మిటరీహాల్ సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటు విష్ణు పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయనున్నట్లు తెలుస్తోంది.



జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : పోలియోరహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి నిర్మించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్య సంరక్షణకు పోలియో చుక్కలు వేయించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. 2012 సంవత్సరం నాటికి భారతదేశం పోలియోరహిత దేశంగా గుర్తింపు పొందిందన్నారు. సమీప దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా దేశంలో పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయవల్సిన అవసరం ఏర్పడిందన్నారు.కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ జిల్లాలో 63,405 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు ఈ నెల 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. డీఎంహెచ్ఓ పరిపూర్ణాచారి మాట్లాడుతూ వంద శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ చిన్నా నాయక్, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు వెంకటేష్, లక్ష్మీ సతీష్, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొదటి రోజు 96 మందికి పోలియో చుక్కలు

తొలి రోజు 63,405 మంది చిన్నారులకు గాను 60,868 మందికి పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వంశీ కృష్ణ తెలిపారు. తొలి రోజు చుక్కలు వేయించుకోని వారి ఇళ్లకు సోమవారం, మంగళవారం వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కల మందు వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రమణేశ్వరంలో విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి రూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గల రమణేశ్వరంలో ఆదివారం రామకృష్ణ పరమహంస ప్రధాన శిష్యుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు అంకురార్పణ చేశారు. 45 శివలింగాలకు భక్తులచే, 35 విగ్రహాలకు మహర్షులచే 35 ద్రవ్యాలను సమర్పించి యంత్ర ప్రతిష్ఠ చేశారు. విగ్రహాల శాంతికోసం, భక్తుల అనుగ్రహ ప్రాప్తికి మహర్షి ఆవహనం చేశారు. మిగతా 11 విగ్రహాలను వచ్చే సంవత్సరం ప్రతిష్ఠించనున్నట్లు సిద్ధగురు రమణానంద మహర్షి సంకల్పించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

కందులు క్వింటా రూ.10,217

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో కందులకు మద్దతుకు మించి ధర పలుకుతున్నాయి. ప్రభుత్వ క్వింటా రూ.7వేలు ఉండగా క్వింటాకు రూ.10,217 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు గత రెండు నెలలుగా మార్కెట్‌కు 9,603 క్వింటాళ్ల కందులు వచ్చాయి. కనిష్టంగా రూ.8వేలు, గరిష్టంగా రూ.10217లకు పైగానే ధర పలుకుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎవరు గెలుస్తారు!

లోక్‌సభ ఎన్నికల్లో జయాపజయాలపై రాజకీయ పార్టీల సర్వే

- ఇప్పటికే అభ్యర్థిని ఖరారు చేసిన బీజేపీ
- బలమైన అభ్యర్థుల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్వేషణ



భువనగిరి మండలంలో ఓ రాజకీయ పార్టీ అభ్యర్థి తరఫున సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సాక్షి, యాదాద్రి : జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. భువనగిరి ఎంపీ స్థానాన్ని దక్కించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అందులో భాగంగా గెలుపోటములపై సర్వే చేయిస్తున్నాయి. బీజేపీ తరఫున డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌ను పార్టీ అధిష్టానం ఇప్పటికే ప్రకటించగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీఆర్ఎస్ గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నాయి. ఇందు కోసం సర్వేలు చేయిస్తున్నాయి.

ఆరు గ్యారంటీలపైనే ప్రధాన దృష్టి

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు, ఉద్యోగాల భర్తీపైనే ప్రధాన దృష్టి సారించింది. అయినప్పటికీ అభ్యర్థుల బలాబలాలను సైతం బేరీజు వేస్తోంది. ఎంపీ సీటు కోసం వచ్చిన దరఖాస్తులను టీపీసీసీ పరిశీలించి ఏఐసీసీకి పంపడానికి షార్ట్ లిస్టును రూపొందించినట్లు సమాచారం. అయితే ఏఐసీసీ కోరినట్లు ముగ్గురి పేర్లు పంపించాలా.. లేక ఇద్దరి పేర్లు పంపించాలా అన్న మీమాంసలో పీసీసీ ఉంది. భువనగిరి ఎంపీ టికెట్ కోసం 23 మంది టీపీసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన టీపీసీసీ.. నలుగురైదుగురిపై సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది. కోమటిరెడ్డి కుటుంబం నుంచి ఎంపీ టికెట్ ఆశిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు మరో ఇద్దరు ఆశావహులపై సర్వేలు జరుగుతున్నాయి. వారికి ప్రజల్లో ఉన్న బలాలు, బలహీనతలు, సామాజిక, ఆర్థిక విషయాలపై సర్వే చేస్తున్నారు. అంతే కాకుండా మోదీ పాలనపై వ్యతిరేకత, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీల ద్వారా ప్రజల నాడి పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పదేళ్ల పాలనపై బీజేపీ సర్వే

బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలోనే భువనగిరి అభ్యర్థిగా మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్య పేరు ఖరారైంది. అయితే అభ్యర్థి ఎంపికకు ముందే బీజేపీ కేంద్ర కమిటీ పలుమార్లు సర్వే చేయించింది. పార్టీ ముఖ్య నేతల నుంచి అభిప్రాయాలు స్వీకరించింది. అభ్యర్థి పేరు ప్రకటించిన తర్వాత సైతం కేంద్ర ఇంటలిజెన్స్ బృందాలు, ప్రత్యేక ఏజెన్సీలు సర్వేలు చేస్తున్నాయి. ప్రధానందగా మోదీ పదేళ్ల పాలనపైనే సర్వే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రజలనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు.

బలమైన అభ్యర్థి కోసం బీఆర్ఎస్

అసెంబ్లీ ఎన్నికలో ఘోరంగా దెబ్బతిన్న బీఆర్ఎస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా బలమైన అభ్యర్థి ఎంపిక కోసం అన్వేషణ సాగిస్తోంది. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప తేడాతో ఓటమి చవిచూసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలుకాకుండా ప్రజల్లో అన్ని విధాలా సానుకూలత ఉన్న అభ్యర్థుల నిలిపే ప్రయత్నంలో ఉంది. అందుకోసం అభ్యర్థి ఎంపికకు సర్వేలకు ప్రాధాన్యం ఇస్తోంది.

నాలుగైదు పేర్లు పరిశీలన

లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి నుంచి బరిలో నిలిపేందుకు బీజేపీ అధిష్టానం నలుగురైదుగురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా బీసీ, ఓసీ సామాజిక వర్గాల అభ్యర్థులపై సమాచారం సేకరిస్తోంది. ఆశావహులపై, కాంగ్రెస్ పాలనపై ప్రజలనుంచి స్పందన ఎలా ఉందని కూడా సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, వ్యతిరేకత ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు.

ఎవరిదో మోత్కూరు చైర్మన్ పీఠం?

- నేడు ఉదయం 11 గంటలకు మున్సిపల్ ప్రత్యేక సమావేశం
- హాజరుకావాలని 12 మంది కౌన్సిలర్లకు నోటీసులు
- ఆర్డీఓ ఆధ్వర్యంలో ఎన్నిక



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లు

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ నూతన చైర్మన్‌ను సోమవారం ఎన్నుకోను న్నారు. ఇందు కోసం ఉదయం 11గంటలకు మున్సిపల్ ప్రత్యేక సమావేశం నిర్వహించ "న్నారు. మున్సిపాలిటీ పరిధిలో 12మంది కౌన్సిలర్లు ఉండగా సమావేశానికి హాజరుకావాలని వారందరికీ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ నోటీసులు అందజేశారు. ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు పది మంది కలిసి శనివారం క్యాంపునకు తరలివెళ్లారు. క్యాంపునుంచి నేరుగా సమావేశానికి హాజరుకానున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డిపై వైస్ చైర్మన్‌తో సహా బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు తొమ్మిది మంది ఫిబ్రవరి 9న ప్రవేశపెట్టిన అవిశ్వాస నెగ్గింది.

క్యాంపుల్లో కౌన్సిలర్లు : బీఆర్ఎస్ కౌన్సిలర్లు వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, పురుగుల వెంకన్న, లెంకల సుజాత, వనం స్వామి, దబ్బేటి విజయ, కూరెళ్ల కుమారస్వామి, కాంగ్రెస్ సభ్యులు కారుపోతుల శిరీష, ఎర్రబెల్లి మల్లమ్మ, మలిపెద్ది రజిత, గుర్రం కవిత క్యాంపునకు వెళ్లిన వారిలో ఉన్నారు. 11వ వార్డుకు చెందిన గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి చైర్మన్‌గా పోటీలో ఉన్నారు.

సగానికి పైగా హాజరైతేనే...

12 మంది కౌన్సిలర్లలో సగం మందికి పైగా హాజరు అయితే ఎన్నికను నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారిగా భువనగిరి ఆర్డీఓ అమరేందర్ వ్యవహరించనున్నారు.

ఉత్తమ రైతుకు నీటి కష్టాలు

- వాల్టాచట్టం పేరుతో సమీప రైతు ఫిర్యాదు
- బోరు సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు
- విద్యుత్ కనెక్షన్ తొలగించిన ట్రాన్స్‌కో సిబ్బంది
- సాగు నీరు లేకపోవడంతో పంటకు ట్యాంకర్లతో సరఫరా



అధికారులు సీజ్ చేసిన బోరు

చౌటుప్పల్ : ఆ మహిళా రైతు భూమిలో అద్భుతాలు సృష్టిస్తోంది. ప్రకృతి సిద్ధంగా పంటలు పండిస్తూ, అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. తాను సాగు చేసిన పంటలపై ఇతర రైతులకు అవగాహన కల్పిస్తోంది. రాష్ట్ర స్థాయిలో పలుమార్లు ఉత్తమ మహిళా రైతుగా అవార్డులు అందుకున్నారు. ఇప్పుడు ఆ ఉత్తమ రైతుకే కష్టాలు వచ్చాయి. సమీప రైతు ఇచ్చిన ఫిర్యాదుతో అధికారులు బోరు సీజ్ చేశారు. దీంతో పంటను కాపాడుకునేందుకు ఉత్తమ మహిళా రైతు వాకిటి రజితారెడ్డి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

వివరాలిలా..

చౌటుప్పల్ మండల పరిధిలోని పెద్దకొండూరు పంచాయితీ మదిర తమ్మలోనిబావి గ్రామానికి చెందిన వాకిటి రజితారెడ్డికి వ్యవసాయం అంటే మక్కువ. స్వగ్రామంలో తనకున్న నాలుగు ఎకరాలకు తోడు వాకిటి రాజశేఖర్‌రెడ్డికి చెందిన మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. భర్త రాజేందర్‌రెడ్డితో కలిసి వరితోపాటు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. ఎరువులు, రసాయనాలు, క్రిమిసంహారక మందులు వాడకుండా ప్రకృతి సిద్ధమైన పద్ధతులు వినియోగిస్తున్నారు. గత ఏడాది రాజశేఖర్‌రెడ్డి భూమిలో బోరు వేయగా సమృద్ధిగా నీరు వచ్చింది. మోటారు బిగించే ప్రయత్నంలో సమీప రైతు వాల్టా చట్టం కింద రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన అధికారులు.. ఇరు పక్షాలకు నచ్చజెప్పారు. అయినా ఫిర్యాదుదారుడు వినకపోవడంతో నిబంధనల ప్రకారం అధికారులు బోరు సీజ్ చేశారు. కొంతకాలం తర్వాత ఉత్తమ రైతు రజిత, భూమి యజమాని సీజ్ చేసిన బోరును తిరిగి ప్రారంభించారు. ఈ విషయాన్ని ఫిర్యాదుదారుడు ఇటీవల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మరోసారి బోరు సీజ్ చేశారు. విద్యుత్ కనెక్షన్ కూడా తొలగించారు.



కూరగాయల తోటకు ట్యాంకర్ ద్వారా నీటిని అందజేస్తున్న వాకిటి రజితారెడ్డి దంపతులు

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

రజితారెడ్డి సొంత భూమిలో ఉన్న బోరు తక్కువగా పోస్తుండడంతో కూరగాయల తోటలను నీరందని పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి అందజేస్తున్నారు.


కావాలనే ఫిర్యాదు చేశాడు



సమీప రైతు మాపై కావాలని ఫిర్యాదు చేశాడు. మా బోరు వల్ల ఫిర్యాదుదారుడి బోరుకు ఎలాంటి నష్టం లేదు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలు సైతం అతనితో చర్చించారు. ప్రస్తుతం కూరగాయల తోటలు వాడుపడుతుండడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి అందజేస్తున్నాం. ఉత్తమ రైతుగా ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచిన తనకు అధికారులు న్యాయం చేయాలి.

– వాకిటి రజితారెడ్డి, రైతు, పెద్దకొండూరు

కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి



రైతు వాకిటి రజిత కౌలుకు తీసుకున్న భూమిలో వేసిన బోరు వాల్టా చట్టానికి విరుద్ధంగా ఉందని సమీప రైతు గత ఏడాది ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి బోరు సీజ్ చేశాం. ఆ తరువాత రజితారెడ్డి కోర్టును ఆశ్రయించారు. కొంతకాలం తర్వాత బోరును తిరిగి ప్రారంభించారు. ఫిర్యాదుదారుడు మాకు సమాచారం అందజేయడంతో మరోసారి బోరు సీజ్‌చేశాం. సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి.

– హరికృష్ణ, తహసీల్దార్

క్లుప్తంగా

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఫారెస్ట్ డివిజన్‌లోని నాగార్జునపేట తండా ప్రాంతంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. మంటలు లేచి అడవిని చుట్టుముట్టడంతో అటవీశాఖ సిబ్బంది ఆప్రాంతానికి వెళ్లి ఫైర్ బ్లోయర్ల సహాయంతో ఆర్పారు. కిలోమీటరు మేరమంటలు అంటుకోవడంతో అష్టకష్టాలు పడి మంటలను అదుపులోకి తెచ్చారు. నాగార్జునపేట ప్రాంతంలో రైతులు పత్తికట్టెతో పాటు చెలకలలో ఉన్న చెత్తచెదారాలను తగుల బెట్టి వాటిని ఆర్పకుండానే రావడంతో గాలికి సమీపంలోగల అటవీ ప్రాంతం అంటుకుంది. మంటలు చెలరేగడంతో రైతులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన వెళ్లి మంటలను ఆర్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చౌటుప్పల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్నకొండూర్-మసీదుగూడెం రోడ్డులో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మసీదుగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ గోరేమియా(47) కులవృత్తి అయిన బండరాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా శనివారం ఉదయం పని కోసం మండలంలోని ఎస్.లింగోటం గ్రామానికి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు 9గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడు. కానీ ఇంటికి మాత్రం వెళ్లలేదు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు మరో సారి ఫోన్ చేయగా సమీపంలో ఉన్న ఓ వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేశాడు. ఇక్కడ ఈయన పొలంలో పడి చనిపోయాడని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా పొలంలో ఎలా పడ్డాడన్న విషయంలో స్పష్టతలేదు. అయితే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో పడిపోయాయని మృతుడి తండ్రి గాలీబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

అపరిశుభ్రమైన ఐస్‌క్రీమ్‌లు పట్టివేత

భువనగిరి క్రైమ్: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. భువనగిరి పట్టణంలోని బీచ్ మహల్లా కాలనీలో ఆశిష్ కుశ్వ హెల్తీ డైరీటెక్ ఐస్‌క్రీమ్ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం ఎస్ఓటీ పోలీసులు సమాచారం మేరకు ఐస్‌క్రీమ్ యునిట్‌పై దాడి చేశారు. నల్లగొండకు చెందిన నరేందర్ ఇద్దరు కలిసి వ్యాపారం చేస్తుండగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నట్లు తేలింది.ఈ దాడుల్లో ఎల్‌టి డైరీ, టెక్ కోన్ ఐస్ క్రీమ్‌లు పెద్ద సైజు 80, మినీ సైజ్ 180, చాకోబార్ 240, వెనిలా 200, ఆరోగ్యకరమైన డిఎల్ డైరీ టెక్‌గ్రేప్ అండ్ మ్యాంగో బార్ ఐస్‌క్రీమ్‌లు, డ్రై ఐస్‌క్రీములు 5 కిలోలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఓటీ పోలీసులు తెలిపారు.

'గృహజ్యోతి'తో వెలుగులు

- పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిప్పర్తి మండలంలో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలల్లో రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో ప్రభుత్వం చొరవ చూపుతుందని అన్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా ఐదవ పథకం గృహజ్యోతి ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. దురదృష్టవశాత్తు ఈసారి వర్షాలు లేకపోవడం వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయంలో నీరు అడుగంటిపోయాయన్నారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, బద్దం సుధీర్, ముత్తినేని శ్యామ్‌సుందర్, జాకటి మోష తదితరులు పాల్గొన్నారు.


కనగల్ మండలం దర్వేశిపురం వద్ద రోడ్డు పనులు పరిశీలిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి


తిప్పర్తిలో లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న మంత్రి, ఎస్ఈ, డీఈలు

అభివృద్ధి పనులకు శ్రీకారం

తిప్పర్తి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆదివారం తిప్పర్తి మండలంలో పర్యటించిన ఆయన పల్స్ పోలియో కేంద్రాన్ని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లకు నూతన భవనం నిర్మించేందుకు అంచనా వేసి పనులకు వెంటనే చర్యలు తీసుకోవాలని పీఆర్ డీఈ నాగయ్యను ఆదేశించారు.

అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్

కనగల్ : కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని మంత్రి కోమటిరెడి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కనగల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గృహజ్యోతి జీరో బిల్లును ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మండలంలోని పగిడిమర్రి, దోరెపల్లి వంతెనతో పాటు ఆయా గ్రామాల్లో రెండు వరుసల రహదారులను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కనగల్ మండల కేంద్రాన్ని సుందరీకరించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తిచేయడంతో పాటు కాలువల లైనింగ్‌కు సీసీకి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మందడి రాంచంద్రరెడ్డి కాంగ్రెస్ నాయకులు గుండెబోయిన భిక్షంయాదవ్, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, భారత వెంకటేశం, కోయగూర అంజిరెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, గోలి జాగల్‌రెడ్డి, గోలి నర్సిరెడ్డి, బొగరి రాంబాబు, దేప నరేందర్‌రెడ్డి, హఫీజ్, బిళ్లపాటి మోహన్‌రెడ్డి, రాయల శ్రవణ్ తదితరులున్నారు.

రోడ్డుపైనే ధాన్యం ట్రాక్టర్ల నిలిపివేత


బాబుసాయి పేట రోడ్డులో నిలిపిన ధాన్యం ట్రాక్టర్లు

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బాబుసాయి పేట రోడ్డులో ఉన్న రంగా ఫుడ్ ప్రోడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యం ట్రాక్టర్లు నిర్లక్ష్యంగా రోడ్డుపైనే నిలిపి ఉంచుతుండడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ రోడ్డు అయినప్పటికీ నడి రోడ్డుపైనే భారీ బోరాల్లో ధాన్యం నింపుకున్న ట్రాక్టర్లు నడి రోడ్డుపైనే నిలుపుతుండడంతో చిన్న వాహనాలు సైతం పోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డులో భారీ పరిశ్రమలైన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, విశాఖ ఇండస్ట్రీస్, వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం, టీఎస్ మోడల్ స్కూల్, కస్తూరీ భా గాంధీ పాఠశాలు ఉండడంతో ఈ రోడ్డు వెంట వాహనాలు నిత్యం రద్దీగా ఉంటుంది. పాఠశాలలు,కళాశాలు కూడా ఉండడంతో విద్యార్థులకు ఎక్కడా ప్రమాదాలు జరుగుతాయనో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం భయపడుతున్నారు. మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు వెంట హైదరాబాద్ వెళ్లడానికి భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. రైస్ మిల్లు యాజమాన్యం మిల్లుకు వచ్చిన వాహనాలను నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


హైవేపై బోల్తాకొట్టిన సిమెంట్ ట్యాంకర్

కట్టంగూర్ : కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామశివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. అయిటిపాముల గ్రామానికి చెదిన సున్నపు రాజశేఖర్(23) ద్విచక్ర వాహనంపై నకిరేకల్ నుంచి స్వగ్రామం బయలుదేరాడు. మార్గమధ్యలోని అయిటిపాముల గ్రామ శివారులోని చెర్వుఅన్నారం బస్‌స్టాప్ వద్దకు రాగానే సూర్యాపేట నుంచి హైదరాబాదు వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ ట్యాంకర్ టైర్ల మధ్య ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అదుపు తప్పిన ట్యాంకర్ కల్వర్టు బ్రిడ్జి గోడను ఢీకొట్టి పల్టీకొట్టింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని తొలగించి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎన్ శ్రీను తెలిపారు.

ముగిసిన ఆర్యసమాజ్ శతాబ్ది ఉత్సవాలు


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యసమాజ్ సభ్యులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో ఆర్య సమాజ్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన ఆర్య సమాజ్ శతాబ్ది, సరస్వతీ దయానంద మహర్షి ద్విశత జయంతి ఉత్సవాలు మూడు రోజులపాటు కొనసాగాయి. ముగింపు కార్యక్రమానికి రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణంలో మూడు రోజుల పాటు మహాయజ్ఞం నిర్వహించడం శుభసూచకమన్నారు. ప్రభుత్వ నిధుల ద్వారా ఆర్య సమాజంలో గోశాలను ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా గోమాత పూజ, హోమం నిర్వహించారు. అనంతరం ఆర్య సమాజ్ కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్య ప్రతినిధి సభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ విఠల్‌రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోయినపల్లి కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఆర్య సమాజ సభ్యులు కంది సూర్యనారాయణ, రవీందర్‌రావు, శంకర్, లక్ష్మీనర్సు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని మృతదేహం

హుజూర్‌నగర్: అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల ఎల్‌బీనగర్ శివారు జాన పహాడ్ మేజర్ కాలువలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం 2022 సంవత్సరం అక్టోబర్ 10వ తేదీన మేజర్ కాలువలో కొట్టుకు వచ్చినట్లు సీఐ చరమందరాజు ఆదివారం తెలిపారు. మృతుడి దేహంపై తెలుపు రంగు లుంగీ, నీలి, తెలుపు రంగు గడులు గల ఫుల్ షర్ట్ ఉన్నదని, భుజంపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ వ్యక్తిని ఎవరో వ్యక్తులు చంపి, చేతులు కట్టి, ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెట్టి కాలువలో పడవేసినారని పంచాయతీ సెక్రెటరీ ఫిర్యాదు మేరకు గరిడేపల్లి పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక సీఐ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

కరాటేలో రాణిస్తున్న యశ్విత


సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న యశ్విత

మునగాల(కోదాడ): మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన బాలెంల వెంకన్న, కళావతి దంపతుల కుమార్తె యశ్విత కరాటేలో రాణిస్తోంది. ప్రస్తుతం కోదాడ పట్టణంలోని జిల్లా పరిషత్(బాలికల) ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న యశ్విత గత ఏడాది కాలంగా స్థానికంగా ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ సహదేవ్ వద్ద శిక్షణ పొందుతోంది. ఈ క్రమంలో ఖమ్మం, వరంగల్ పట్టణాల్లో జిల్లాస్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఆదివారం ఖమ్మం పట్టణంలో సుమన్ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ కాంపిటీషన్ పోటీల్లో యశ్విత పాల్గొని ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్, ప్రశంసాపత్రం అందుకుంది. యశ్విత చదువుతో పాటు కరాటేలోనూ రాణిస్తుండడంతో ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కారు బోల్తా... నలుగురికి గాయాలు


బోల్తాపడిన కారు

భూదాన్‌పోచంపల్లి: వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడగా.. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం పోచంపల్లి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరు నుంచి పోచంపల్లి వైపు వస్తున్న కారు పోచంపల్లి పట్టణంలోని మార్కండేయనగర్ కాలనీ దాటిన తర్వాత జీబీఆర్ గార్డెన్స్ సమీపంలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే కొత్తపేటకు చెందిన పేర్ల రవికుమార్, పిట్టం శకుంతలతో పాటు రవికుమార్ పిల్లలు పేర్ల శ్రీలక్ష్మి, పేర్ల సాయితేజ కాళ్లు, తలకు గాయాలయ్యాయి. వెంటనే అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకొని బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఆత్మహత్య


యమున మృతదేహం

కట్టంగూర్: మండల పరిధిలోని అయిటిపాముల గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన దేవరపల్లి యమున(30) ఆరు నెలల క్రితం అయిటిపాముల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధుల్లో చేరింది. అయిటిపాములలోనే అద్దె ఇంట్లో ఉంటున్న యమున ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తలుపులు తీయకుండా ఉండటంతో చుట్టుపక్కల వారు గమనించి నల్లగొండలో ఉంటున్న ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ నుంచి వచ్చిన బంధువులు తలుపులు తీసి చూసేసరికి యమున చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. యమున మృతిపై అనుమానం ఉందని ఆమె అన్న దేవరపల్లి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపారు.

భీమనపల్లిలో రెండిళ్లలో చోరీ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని భీమనపల్లి గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. భీమనపల్లి గ్రామానికి చెందిన ఎడమ కొండల్‌రెడ్డి కొద్దిరోజులుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. శనివారం రాత్రి అతడి ఇంటి తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి బీరువాలోని రూ.15వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం వాకిలి ఊడ్చటానికి వచ్చిన పనిమనిషి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి కొండల్‌రెడ్డికి సమాచారం ఇచ్చింది. అదేవిధంగా గ్రామానికే చెందిన రాసాల శ్రీశైలం తన తల్లికి ఆరోగ్యం బాగోలేకపోతే చికిత్స నిమిత్తం నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆయన ఇంటి తాళాలు కూడా పగులగొట్టి బ్యాగులో దాచిన తులంన్నర బంగారు కమ్మలు, బుట్టాలను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చామని బాధితులు పేర్కొన్నారు. కాగా శుక్రవారం రాత్రి కూడా భీమనపల్లి గ్రామంలో నాలుగిళ్లలో దుండగులు చోరీలకు పాల్పడ్డారు. గ్రామంలో వరుసగా చోరీలు జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

బైక్ అదుపుతప్పి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


వెంకన్న (ఫైల్)

పెన్‌పహాడ్: మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. వివరాలు.. సూర్యాపేట పట్టణంలో నివాసముంటున్న మైలారపు వెంకన్న(56) పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సొంత పనుల నిమిత్తం బైక్‌పై పెన్‌పహాడ్ మండల కేంద్రానికి వచ్చి సూర్యాపేట వెళ్తుండగా పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య వనజ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకన్న కుటుంబానికి ఎంఈఓ నకిరేకంటి రవి, ఉపాధ్యాయ బృందం ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కట్టంగూర్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కట్టంగూర్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండల కేంద్రంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అశోక్ లేలాండ్ వాహనం సూర్యాపేట నుంచి హైదరాబాదు వైపు వెళుతుండగా పట్టుబడినట్లు తెలిపారు. వాహనంలో రెండు టన్నుల నాలుగు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని డ్రైవర్ ధరావత్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

పెన్‌పహాడ్ : ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... మేళ్లచెరువు మండలం కప్పలకుంట తండాకు చెందిన భూక్య శ్రీను బైక్‌పై సూర్యాపేట నుంచి ఇంటికి వెళ్తుండగా పెన్‌పహాడ్ మండలానికి చెందిన ఆటో సూర్యాపేట వైపు వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి


యాదగిరి మృతదేహం


తిరుమలగిరి (తుంగతుర్తి): తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. తొండ గ్రామానికి చెందిన ఈరెంటి యాదగిరి(50) గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. స్థానికులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విష్ణువర్ధన్‌శర్మకు అర్చక ఆధ్యాత్మిక సార్వభౌమ బిరుదు


విష్ణువర్ధన్‌శర్మను సత్కరిస్తున్న రుద్రాక్ష సేవా సంస్థ నిర్వాహకులు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మను సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం తరపున ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 ఉగాది పురస్కారాలను పురస్కరించుకొని అర్చక ఆధ్యాత్మిక సార్వభౌమ బిరదుతో పాటు స్వర్ణ కంకణం, గోల్డ్ మెడల్ అందజేసినట్లు తెలిపారు.

స్ప్రేయర్ల ఎంపిక.. పిచికారీ సులువిక



పెద్దవూర: ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలకు పురుగులు, తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో రైతులకు పంటలపై ఒకటికి రెండు సార్లు క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడం పరిపాటిగా మారింది. పిచికారీ చేసేందుకు అవసరమైన స్ప్రేయర్లను సరిగా ఎంపిక చేసుకోకపోతే రసాయనాలు వృథా కావడంతో పాటు పిచికారీ చేసే వ్యక్తి శరీరంపై ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో వివిధ రకాల స్ప్రేయర్లకు సంబందించిన విషయాలు పెద్దవూర మండల వ్యవసాయ అధికారి పి. సందీప్ వివరించారు.


తైవాన్ స్ప్రేయర్


ఫుట్ స్ప్రేయర్

తైవాన్ పవర్ స్ప్రేయర్..

ఇటీవల అన్ని రకరాల పంటలకు తైవాన్ పవర్ స్ప్రేయర్లతో మందులను పిచికారీ చేస్తున్నారు. దీని ఖరీదు కంపెనీలను బట్టి రూ.20వేల వరకు ఉంటుంది. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో వెదజల్లే సామర్థ్యం దీనికి ఉంది. ఇతర వాటితో పోల్చితే దీనిలో సస్యరక్షణ మందులు మూడు వంతులు అధికంగా పోయాల్సి ఉంటుంది. రోజుకు సగటున 8 నుంచి 10 ఎకరాలలో పిచికారీ చేయవచ్చు. దీనికి అమర్చిన బెల్ట్ ద్వారా భుజాల వెనుక సులభంగా తగిలించుకోవచ్చును. ఈ పవర్ స్ప్రేయర్ చదరపు సెంటీమీటర్‌కు 30-35 కిలోల ఒత్తిడిని కలగజేస్తుంది. నీటి బిందువులు గుండ్రంగా తిరగడం వలన ఆకుల పైభాగాన, కింది భాగాన పడతాయి. ఇంజిన్ పనిచేయడానికి గంటకు లీటర్ పెట్రోల్ అవసరం అవుతుంది. లీటర్ పెట్రోల్ ఆరు ఎకరాలకు సరిపోతుంది. నిమిషానికి 7.2 లీటర్ల మందును చల్లవచ్చు. బరువు తొమ్మిది కిలోలు. దీనిలో 20 లీటర్ల రసాయం ద్రావణం, 900 మి.లీ. ల పెట్రోల్ పడుతుంది. ఇటీవల వచ్చిన ఆధునాతన పవర్ స్ప్రేయర్‌లతో ఒక వ్యక్తి మందు ద్రావణ డబ్బాను భుజానికి తగిలించుకుంటే , రెండు వైపులా ఇద్దరు వ్యక్తులు ఏకకాలంలో రసాయన మందును పిచికారీ చేసే పరిస్థితి వచ్చింది.

ఫుట్ స్ప్రేయర్..

ఇది కాళ్లతో పనిచేస్తుంది. మినుము, పెసర వంటి పంటలతో పాటు కూరగాయ తోటలు, మామిడి, బత్తాయి వంటి పండ్లతోటల్లో సస్యరక్షణ మందులను పిచికారీ చేయవచ్చు. రోజుకు రెండు ఎకరాల్లో, పండ్ల తోటల్లో సగటున రోజుకు 150 చెట్లకు పిచికారీ చేయవచ్చు. ధర నాలుగు వేల లోపే ఉంటుంది. ఇత్తడితో తయారైన ఫుట్‌స్ప్రేయర్‌లో ప్రధానంగా చిన్న బ్యారల్, కదిలే పిస్టన్ ఉంటుంది. బ్యారల్ అడుగుభాగానికి ప్లాస్టిక్ గొట్టం కలపబడి ఉంటుంది. రెండో చివరన ఫిల్టర్ గరాటు బిగించబడి ఒక పాత్రలోని రసాయన ద్రావణంలో మునిగి ఉంటుంది. పెడల్‌ను కాళ్లతో తొక్కినప్పుడు పిస్టన్ బ్యారల్‌లో పైకి కిందికి కదలడంతో ద్రావణం బ్యారల్ పైభాగానికి చేరి అక్కడి నుంచి గాలి గది ద్వారా రెండో గొట్టం చివర ఉన్న నాజిల్ గుండా బయటకు వెళుతుంది. గాలి గది అమరిక వల్ల ద్రావణంపై పీడనం ఎల్లప్పుడు సమానంగా ఉంచి పిచికారీ ఒకే విధంగా ఉండటానికి తోడ్పడుతుంది. దీనిలో చదరపు సెంటీమీటర్‌కు 8 నుంచి 13 కిలోల ఒత్తిడి తీసుకురావచ్చు. అధిక ఒత్తిడి వలన ఎత్తుగా ఉన్న మామిడి చెట్లకు సులభంగా పిచికారీ చేయవచ్చు.

నాప్‌సాక్ స్ప్రేయర్

దీని బరువు తక్కువగా ఉండేందుకు పాలిథీన్‌తో తయారు చేస్తారు, స్ప్రేయర్ ట్యాంకు పరిమాణం 15-16 లీటర్లు. దీనికి ఉన్న బెల్టుల ద్వారా భుజాల వెనక సులువుగా తగిలించుకోవచ్చు. పంట అన్ని దశల్లో మందు పిచికారీకి స్ప్రేయర్ సులువుగా ఉపయోగపడుతుంది. ధర రెండు వేల లోపే ఉంటుంది. ట్యాంకు లోపలి భాగాన పంపు, గాలి గది, పైభాగాన ఒక రంధ్రానికి ప్లాస్టిక్ గొట్టం బిగించబడి ఉంటుంది. రెండో చివర నాజిల్ ఉంటుంది. ట్యాంకులో అమర్చబడిన పిస్టన్ పైకి కిందకు కదలడం వలన ద్రావణంపై ఒత్తిడి ఏర్పడి రబ్బరు గొట్టం ద్వారా నాజిల్ ద్వారా బయటకు వెలువడుతుంది. పిస్టన్ కదిలించటానికి హ్యాండిల్ ఉంటుంది. దీనితో రసాయన ద్రావణం అంతటా సమంగా పడుతుంది.